మురిసిన మదనపల్లె

- అభిమాన నాయకుడిని చూసేందుకు రోడ్లపై బారులు తీరిన ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన పట్టణం



అంగళ్లులో వైఎస్ జగన్‌ను చూడటానికి బారులు తీరిన విద్యార్థులు (ఇన్‌సెట్) బురకాయలకోటలో అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మదనపల్లె : జననేత, అభిమాన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అక్కచెల్లెమ్మలు, అన్నలు, అవ్వాతాతలు పెద్ద సంఖ్యలో టిప్పుసుల్తాన్ మైదానానికి తరలిరావడంతో మదనపల్లె జనసంద్రమైంది. ఎండను సైతం లెక్కచేయకుండా, ఉక్కపోతకు గొంతులో తడి ఆరుతున్నా... రాజన్న బిడ్డపై అభిమానాన్ని చాటేందుకు గంటల తరబడి వేచి చూశారు. ఒక్కసారిగా జగనన్నను చూడగానే ఉరిమే ఉత్సాహంతో ఉరకలేస్తూ, జై జగన్, జై జగన్, సీఎం, సీఎం అంటూ నినాదాలు చేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా మంగళవారం మదనపల్లెకు చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా జన నీరాజనం కనిపించింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో అంగళ్లు–మదనపల్లె మార్గంలోని విశ్వం కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన క్యాంపు నుంచిసాయంత్రం 4.10 నిమిషాలకు బయలుదేరిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్... ఆరుకిలోమీటర్లలోని బహిరంగ సభావేదిక టిప్పుసుల్తాన్ మైదానం వద్దకు చేరుకునేందుకు 1.25 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అమ్మచెరువుమిట్ట నుంచి బస్సు టాప్‌పైకి ఎక్కిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దారి పొడవునా ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. మహిళలు మంగళహారతులు, పూలవర్షాలతో అడుగడుగునా అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ జెండాలను ఊపుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వాటిని చూపిస్తూ ప్రజలు ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోయారు. సాయంత్రం 5.33కి సభావేదిక వద్దకు చేరుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపుపై నడుస్తూ, రెండుచేతులతో ప్రజలకు నమస్కరిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఓ అమ్మాయి ర్యాంపునకు సమీపంలో జగనన్నా అంటూ ప్రేమగా పలకరిస్తే.. పులకరించిన ఆయన, వేదికపైకి అమ్మాయిని రప్పించి, తనచేతులతో ప్రజలందరికీ నమస్కరించేలా చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో...తొలుత ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, ఎంపీ మిథున్‌రెడ్డి, తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సుమారు గంటసేపు జరిగిన ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. ప్రసంగం ముగింపు సమయంలో రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని 7 అసెంబ్లీ అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థిని ప్రజలకు పరిచయం చేశారు. సభావేదిక వద్ద ప్రజలను అలరించేందుకు ఏర్పాటుచేసిన కళాజాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్‌కుమార్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, దేశాయ్ జయదేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు



జగనన్నకు తోడుగా నేను సైతం సిద్ధం అంటున్న చిన్నారి



అంగళ్లులో వైఎస్ జగన్‌కు హారతులు ఇవ్వడానికి వచ్చిన మహిళలు



జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న అభిమానులు

క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : పట్టణంలోని కుమార్‌నగర్‌కు చెందిన బలరాం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బలరాం స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, రవి తదితరులు ఉన్నారు.

ఘనంగా గంగ జాతర

పెద్దతిప్పసముద్రం : మండలంలో మంగళవారం గంగ జాతర ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మడుమూరు, రంగసముద్రం, కందుకూరు, మద్దయ్యగారిపల్లి, బూర్లపల్లి తదితర గ్రామాల్లో జరిగిన గంగ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ : జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి ఉమెన్స్ లీగ్ స్వయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని ఏపి స్వయ్ మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్ తెలిపారు. అండర్ 14, 17 సీనియర్ బాలికల విభాగాల పోటీల్లో యశిక, భాగ్యశ్రీ, ఉజ్మ, గోవర్ధిని, హర్షిత, షమిత, సారా నిఖిత్ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఏపి స్వయ్ మార్షల్ ఆర్ట్స్ కార్యదర్శి ఇబ్రహీం, ఖాదర్‌బాషాలు అభినందించారు.

నవోదయ ఫలితాలు విడుదల

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. 20.1.24న ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. 6వ తరగతిలో 80 సీట్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైనవారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ప్రారంభం



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధ్యాపకులు

మదనపల్లె సిటీ : స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్‌ను ప్రిన్సిపాల్ ఓబులేసు ప్రారంభించారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచింగ్‌కు హాజరైన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియస్‌ను అందజేశారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

రేపు ఓటుహక్కు అవగాహనపై ర్యాలీ

పీలేరు రూరల్ : ఓటుహక్కు అవగాహనపై గురువారం పీలేరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి రమా తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గంటలకు సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ద్వారా ఎన్నికల భాగస్వామ్యంపై ర్యాలీ ఉంటుందని తెలిపారు. మాజీ సైనికులు, పెన్షనర్ల సంఘం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ వర్కర్లు, లైయన్స్‌క్లబ్, వాసవిక్లబ్, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వాల్మీకిపురం : వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటేనే రైతులకు ప్రయోజనాలు ఉంటాయని మహానంది వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థులు పార్థసారధి రెడ్డి, రంజిత్, రవీంద్ర నాయక్, తులసి రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఓబులంపల్లి విఎస్‌ఏ ఆధ్వర్యంలో గ్రామీణ వనరుల చిత్రపటం, ట్రాన్సాక్ట్ వాక్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పాండురంగ, మాధురి, ఏవో హేమలత, ఆర్‌బికే సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న వెంటే నేనుంటా!

మేమంతా సిద్ధం బస్సు యాత్ర వెంట బైక్‌పై అభిమాని అమర్నాథ్ రెడ్డి



బి.కొత్తకోట : సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఆ యువకుడికి ఉన్న అభిమానం మండుటెండలో బైక్‌పై తిరిగేలా చేస్తోంది. కష్టమైనా జగనన్న మళ్లీ సీఎం కావాలన్న ఆశయంతో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో వెంట ఉంటున్నాడు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆర్. అమర్నాథ్ రెడ్డి. ఏడాదిన్నర కుమార్తె ఉన్న ఈయన భార్య, బిడ్డకు దూరంగా వై.ఎస్.జగన్ వెంట సాగుతున్నాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోకి ప్రవేశించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర వెంట వస్తున్న అమర్నాథ్ రెడ్డి బైక్ మొత్తం వైఎస్సార్‌సీపీ రంగులు, జెండా, సీఎం జగన్ స్టిక్కర్‌తో అందర్నీ ఆకర్షించింది. తనకోసం ప్రతిఒక్కరూ స్టార్ క్యాంపెయినర్లు కావాలని సీఎం జగన్ పిలుపుతో విశాఖలో ఉద్యోగం చేసుకుంటున్న అమర్నాథ్‌రెడ్డి ఉద్యోగం వదులుకుని ఎన్నికలయ్యేంత వరకు ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నాడు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం సభలకు హాజరయ్యాడు. ఇప్పుడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర వెంట బైక్‌పై వెళ్తున్నాడు. యాత్ర పూర్తయ్యే దాకా వెంట ఉంటానని చెప్పాడు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 175 స్థానాల్లో విజయం సాధించి మళ్లీ సీఎం అవ్వాలని ఆశిస్తూ యాత్ర వెంట సాగుతున్నట్లు చెప్పారు.



స్వాగతం పలికేందుకు క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసిన గజమాల

తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోండి

కలకడ : గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జవహర్‌బాబు కోరారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశ డే సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమే తల్లి బిడ్డకు సురక్షితం, క్షేమమని గుర్తు చేశారు. కాబోయే తల్లి మూడు మాసాల నుంచి క్రమం తప్పకుండ రక్తపరీక్షలు చేయించుకొని ఎంసీపీ కార్డులో అన్ని వ్యాధి నిరోధక టీకాలు, బీసీజీ వంటివి నమోదు చేసుకోవాలని కోరారు. వేసవిలో మంచినీరు ఎక్కువగా సేవించాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు పంచాయతీ పందలవారిపల్లెకు చెందిన పి.వెంకటరమణారెడ్డి (60) మాలపల్లి పట్టణంలోని సంఘం ఫంక్షన్ హాలు సమీపంలో నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం వ్యక్తిగత పనులపై నడిచి వెళ్తుండగా వాటర్‌క్యాన్లు సరఫరా చేసే ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట మండలం గొల్లపల్లి పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన బాబ్జాన్(32), మెహరీన్(43) ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, మార్గంమధ్యలోని చెన్నామర్రి మిట్ట వద్ద మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ (38) డ్యూటీ ముగించుకుని ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా గొల్లపల్లి వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చీకిలబైలుకు చెందిన శ్రీనివాసమూర్తి, తన భార్య ఉషారాణి(64)తో కలిసి టీవీఎస్ వాహనంలో రాయల్పాడుకు వెళుతుండగా మార్గమధ్యంలో మరో వాహనం అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు.

సిరికల్చర్ ఉద్యోగికి..

రోడ్డు ప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామానికి చెందిన ఎ.లక్ష్మీనారాయణ(59) హార్సిలీహిల్స్‌లోని సిరికల్చర్ కార్యాలయంలో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి హార్సిలీహిల్స్‌కు వెళ్తుండగా మార్గంమధ్యలోని కంటేవారిపల్లె బస్‌స్టాప్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మానువుల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు రెఫర్ చేశారు. బి.కొత్తకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు

- సైనికుడిగా ఎన్నుకున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు
- మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : రైతులకు, పేద, బడుగు, బలహీన తదితర అన్నివర్గాలకు జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ అన్నారు. మేమంతా సిద్ధం బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ మైనారిటీ వర్గానికి చెందిన, రైతుబిడ్డనైన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా.. 175 మంది సైనికుల్లో ఒకడిగా ఎన్నుకున్నందుకు, వైఎస్సార్ సీపీ కుటుంబంలో అవకాశం కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ పేదల కోసం పనిచేసే పార్టీ అని, ప్రచారంలో భాగంగా ఎక్కడకు వెళ్లినా ప్రజలు పూలవర్షాలు కురిపిస్తూ, మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారని, సీఎం జగన్ ప్రజల్లో తలెత్తుకుని ఓట్లు అడిగేలా చేశారని ప్రశంసించారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి దొరకడం మనందరి అదృష్టమన్నారు. గత ఎన్నికల్లో రెండుపేజీలతో మేనిఫెస్టో ప్రకటిస్తే..151 సీట్లు గెలిపించారని, ఈసారి దాదాపు 125 సార్లు బటన్‌లు నొక్కి, 2లక్షల45వేల కోట్ల రూపాయలు అవినీతిరహితంగా ప్రజల ఖాతాల్లో నేరుగా జమచేశారన్నారు. దీంతో ఎంతోమంది జీవితాలు బాగుపడ్డాయనేందుకు ఇక్కడకు వచ్చిన ప్రజావాహినే నిదర్శనమన్నారు. అందుకే ప్రజలు ఎప్పటికీ జగన్‌కు రుణపడి ఉంటారన్నారు. సీఎం జగన్ మైనారిటీల పక్షపాతి అన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డిని గెలిపించి, సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని అభ్యర్థించారు.

టీడీపీ నేతల తీరుతో 32 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామాపత్రాలు చూపుతున్న వలంటీర్లు

గుర్రంకొండ : వలంటీర్లపై టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మండలంలోని తరిగొండ గ్రామానికి చెందిన 32 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొన్న వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఒకొక్కరుగా ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై టీడీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేయడం బాధాకరమన్నారు. తమపై కక్ష గట్టి టీడీపీ నాయకులు వేధించడం తగదన్నారు. టీడీపీ నాయకుల తీరును నిరసిస్తూ ముకుమ్మడిగా రాజీనామాలు సమర్పించామన్నారు.

అడుగడుగునా నీరాజనం

- మేమంతా సిద్ధం యాత్రకు విశేష స్పందన
- రోడ్‌షోలో ఊరూరా ఎగసిపడిన అభిమానం
- పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికిన మహిళలు



ములకలచెరువు : జన సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రైతులు, వృద్ధులు, కూలీలు, విద్యార్థులు, యువకులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలూ తమ అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చారు. మండుతున్న ఎండను లెక్కచేయకుండా ఆయనను ప్రత్యక్షంగా చూసి పులకించిపోయారు. బారులుదీరి తన కోసం ఎదురు చూస్తున్న ప్రజల అభిమానానికి సీఎం జగన్ ముగ్ధులయ్యారు. సత్యసాయి జిల్లా చీకటిమానుపల్లెలోని విడిది కేంద్రం వద్ద నుంచి మంగళవారం ఉదయం 10.20 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమై అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మండలంలోకి ప్రవేశించింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇతరా నాయకులతో కలిసి ముఖ్యమంత్రి బస్సులో బయలుదేరారు. ములకలచెరువు బస్టాండు కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జై జగన్... జై జగన్ అంటూ నినాదాలతో పూల వర్షం కురిపించారు. మండల నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెద్దపాళ్యం, చీకుచెట్టుపల్లె, వేపూరికోట, బురకాయలకోట, సెంట్రల్‌స్కూల్ గ్రామాల్లో వైఎస్ జగన్ బస్సులో నుంచి దిగి మహిళలతో మాట్లాడారు. బురకాయలకోట సర్పంచ్ వై.విజయమ్మ, వేపూరికోట సర్పంచ్ సునీతలు సీఎంతో సెల్ఫీ తీసుకొని పులకించిపోయారు. సెంట్రల్‌స్కూల్ వద్ద చర్చి పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు అందించి జగన్‌ను దీవించారు.అనంతరం బి.కొత్తకోట మండలంలోకి బస్సుయాత్ర ప్రవేశించింది. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, మడల్‌కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచులు విష్ణువర్ధన్ రెడ్డి, రహమత్‌బీ, జయచంద్ర, మహబూబ్‌బాషా, రెడ్డెప్ప, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' సభకు భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు



గుర్రంకొండ: నడిమికండ్రిగ నుంచి మదనపల్లె సభకు బయలుదేరిన నాయకులు



పీలేరు : పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు వెళుతున్న నాయకులు

గుర్రంకొండ : మదనపల్లెలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న మేమంతా సిద్ధం సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మంగళవారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు. 100 వాహనాల్లో కార్యకర్తలు ఉత్సాహంగా బహిరంగ సభకు తరలివెళ్లడం గమనార్హం. జెడ్పీటీసీ సప్రీన్ ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపీపీ జమీర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్విరమణ, వైస్ ఎంపీపీ కరుణాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

వాల్మీకిపురం నుంచి..

వాల్మీకిపురం : మదనపల్లిలో జరిగిన సిద్ధం సభకు వాల్మీకిపురం మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మంగళవారం ఉదయం మండల వ్యాప్తంగా బస్సులో బయల్దేరి మదనపల్లికు చేరుకున్నారు.

పీలేరు నుంచి..

పీలేరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లె మేమంతా సిద్ధంగా సభకు పీలేరు నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మదనపల్లె మేమంతా సిద్ధం సభకు బయలుదేరిన వాహనాలు, బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని తెలిపారు. అలాగే రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

కేవీపల్లె నుంచి..

కేవీపల్లె : మదనపల్లె మేమంతా సిద్ధం సభకు కేవీపల్లె మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి బస్సులు, సొంత వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, టి. సాహిత్ రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, యల్లయ్య, జయరామచంద్రయ్య, రామకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం నుంచి..

రామసముద్రం : మదనపల్లె టిప్పుసుల్తాన్ మైదానంలో మంగళవారం జరిగిన మేమంతా సిద్ధం కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు , కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలివెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు వెళ్లి అభిమానం చాటారు.

కలకడ నుంచి..

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరైన మదనపల్లెలోని సిద్ధం సభకు కలకడ మండలం నుంచి వేలాందిమంది అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. మండలంలోని అన్ని పంచాయతీల నుంచి ప్రత్యేక బస్సులు, వాహనాలలో బయలుదేరి వెళ్ళారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు మారుమోగాయి.



కేవీపల్లె : గర్నిమిట్ట నుంచి వెళుతున్న నాయకులు, కార్యకర్తలు



రామసముద్రం నుంచి మేమంతా సిద్ధం సభకు..



కలకడ నుంచి సిద్ధం సభకు..